క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సోమవారం ట్రాన్స్‌కో ఏఈ పి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ సీతారాంపురం ఫీడర్, రామచంద్ర గూడం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ బైపాస్ ఫీడర్ల లైన్ పనులు చేస్తున్నందున సీతారాం పురం, బంగారుగడ్డ, రామచంద్రగూడం, భాగ్యనగర్ కాలనీ, శ్రీనిధి కాలనీ, రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం సీతారాంపురం, బంగారుగడ్డ, రాంనగర్, షాబునగర్, పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేపై విమర్శలు తగదు

మిర్యాలగూడ : రైతుల సంక్షేమం గురించి అనునిత్యం ఆలోచించే ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు తగదని కాంగ్రెస్ నాయకుడు బెజ్జం సాయి అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడతూ నియోజకవర్గంలో ఒక్క యూరియా బస్తా కూడా పక్కదారి పట్టలేదన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ షాపు యజమానికి షోకాజు నోటీసు అందజేస్తున్న ఏడీఏ శీలక్ష్మి

పెద్దఅడిశర్లపల్లి : రైతులకు యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని దేవరకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు శీలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దుగ్యాల గ్రామంలో శ్రీ సాయి హనుమాన్ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యూరియా అధిక ధరలకు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. అధిక ధరలకు యూరియా అమ్ముతున్నారనే ఫిర్యాదుతో దుకాణ యజమానుదారుడికి షోకాజు నోటీసు, స్టాప్ సేల్ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరారు. అధిక ధరలకు యూరియా అమ్మినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఏఈఓ పాండు అన్నారు.

హిందీ భాషా దినోత్సవం



హిందీ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండలంలోని తీదేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గంధం సురేందర్ హిందీ భాషా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయుడు రాంరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.పద్మ, శ్రీరాములు, దేవకుమార్, విష్ణుకాంత్, వాసుదేవరెడ్డి, లలిత పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్



పీసీసీ అధ్యక్షుడికి పూల మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కలిశారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని మహేశ్ కుమార్‌గౌడ్ నివాసంలో ఎమ్మెల్యే బాలునాయక్ కలిసి ఆయనను శాలువాతో సత్కరించారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

చందంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ

చందంపేట : స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ మౌనిక మంగళవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా చందంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆమె రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, మండల శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీఐ బీసన్న, ఎస్ఐ లోకేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మూల మలుపు



డిండి : డిండి నుంచి దేవరకొండకు వెళ్లే రోడ్డు మార్గ మధ్యలోని బాపన్‌కుంట వద్ద ఉన్న మూల మలుపు ప్రమాదకరంగా మారింది. బాపన్‌కుంట చెరువుకు ఆనుకొని ఉన్న రోడ్డుకు ఎలాంటి ప్రహరీ లేకపోవడంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు ఆదమరిచినా నేరుగా చెరువులోకి దూసుకెళ్లి ప్రమాదానికి గురవుతారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు స్పందించి మూల మలుపు వద్ద ప్రహరీ నిర్మించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

బాపన్‌కుంట వద్ద ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

ఆరుబయటే వంటలు



నేరెడుగొమ్ము మోడల్ స్కూల్‌లో ఆరుబయట వంటలు వండుతున్న దృశ్యం

చందంపేట : ఆరుబయట వంటలు వండుతూ కనిస్తున్న ఈ దృశ్యం నేరెడుగొమ్ము మోడల్‌స్కూల్‌లోనిది. ఇటీవల కాలంలో ఫుడ్ ఫాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్న తరుణంలో కలెక్టర్, ఉన్నతాధికారులు పరిశుభ్రత పాటించాలంటూ పాఠశాలల ప్రధానోపాధ్యాయలకు సూచిస్తున్నారు. అయినప్పటికీ నేరెడుగొమ్ము మోడల్ స్కూల్‌లో మాత్రం వంట గది లేక 12ఏళ్లుగా ఆరుబయటే వంటలు చేస్తున్నారు. వర్షం వస్తే ఆ రోజు వంట ఆలస్యం కావడం, లేదా వంటలు నాణ్యత లోపిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కాగా మోడల్ స్కూల్‌కు ఇటీవల మంజూరు చేయగా నిర్మాణం చేపడుతున్నారు. సుమారు 300మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో నిర్మాణం చేపడుతున్న వంట గది చిన్నదిగా ఉండడంతో నిర్మించిన పెద్దగా ఉపయోగం ఉండదని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అధికారులు స్పందించి సరిపడా వైశాల్యంలో వంట గదిని నిర్మించాలని కోరుతున్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి



దేవరకొండ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ రమణారెడ్డి



గుర్రంపోడు : కేజీబీవీలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్

దేవరకొండ : ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో తప్పనిసరిగా మెనూ పాటించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. వసతి గృహాలకు వచ్చే వంట సామగ్రి, కూరగాయలు, నిత్యావసర సరుకులను శుభ్రమైన ప్రదేశాల్లో నిల్వ ఉంచాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలకేంద్రంలోని కేజీబీవీని మంగళవారం తహసీల్దార్ పి. శ్రీనివాస్ తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను వంటగది, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన సూచించారు. తహసీల్దార్ వెంట ఎస్ఓ విజయశ్రీ ఉన్నారు.

వార్డుల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలి

మిర్యాలగూడ టౌన్ : బతుకమ్మ వేడుకల దృష్ట్యా వార్డుల్లో వీధి లైట్ల సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా జవాన్లు పారిశుద్ధ్య వ్యవస్థపై దృష్టిని సారించాలన్నారు. అదే విధంగా నీటి విభాగం సిబ్బంది నీటి సమస్య అనేది లేకుండా చూడాలన్నారు. అదే విధంగా ఆస్తి పన్ను, నీటి పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణలతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురావాలి

వార్డులో ఏమైనా సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 29వ వార్డును సందర్శించి మాట్లాడారు. అనంతరం వార్డులోని ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ జావిద్‌లతో పాటు పలువురు సిబ్బంది తదితరులున్నారు.



కాలనీలను పరిశీలిస్తున్న మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంఈఓలు వెంకటయ్య, శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. తరగతి గదిలోనే సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర క్రియాశీలకమైందన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జీవన్‌కుమార్, విజయభాస్కర్, సతీష్‌లతో పాటు మండలంలో ఎంపికైన 15మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌లు జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మూనా, అనీల్‌కుమార్, యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జీవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు శ్రీనయ్య, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



వాటర్ క్యాన్లు అందజేస్తున్న దాత

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని రిటైర్డ్ హెచ్ఎం సర్నాల వెంకన్న యాదవ్ అన్నారు. సర్నాల వెంకన్న యాదవ్ ఇటీవల పాల్తీ తండా ప్రదానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందారు. త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు 30 వాటర్ క్యాన్లను అందించారు. ఈ సదర్భంగా వెంకన్న యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో చదువుతోనే ఉన్నతమైన గుర్తింపు వస్తుందని, విద్యార్థులను చదువులను భారంగా అనుకోకుడా ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తాగు నీటి ఇబ్బందులను గుర్తించి వాటర్ క్యాన్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరా రెడ్డి, మెండె వెంకట్, శ్రీనయ్య, లక్ష్మీనర్సయ్య, వెంకన్న, శ్రీనివాస్, పులిజాల విష్ణుకుమార్, సైదా నాయక్, జానకమ్మ, గీత, రమణి, ఏడుకొండలు, సరోజ, విజయ భాస్కర్, కోటేశ్వర రావు, వరమ్మ, దశరథరాం, బోడ్డు బంగారు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకొని విజయాలు సాధించాలి



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా విద్యార్థి దశనుంచే లక్ష్యాలను నిర్దేశించుకొని విజయాలు సాధించాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సిద్ధార్థ పారామెడికల్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి బావోద్వేగాలకు లోనై అవగాహన లోపంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. మంచి లక్షణాలతో సానుకూల ధృక్పథాన్ని అలవర్చుకుని క్రమ శిక్షణ కలిగిన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. మానసిక సమార్థ్యాన్ని స్నేహభావాన్ని పెంచుకోవాలని, బావోద్వేగాలను అదుపులో పెట్టుకొని బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండీ, మునీర్, కళాశాల ప్రిన్సిపల్ శ్రవంతి, దయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌పై వెళ్తున్న పీఈటీకి సన్మానం

పెద్దవూర: మండలంలోని వెల్మగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో పీఈటీగా పనిచేసి ప్రమోషన్‌పై ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా తిప్పర్తి జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీపై వెళ్లిన నిమ్మల లెనిన్‌బాబును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు పూలమాలలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఎంఈఓ తరిరాములు మాట్లాడుతూ చిన్నతనంలోనే ఉద్యోగం సాధించి ఎందరో విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ఉత్తమ ప్రతిభ కనపర్చడంలో లెనిన్‌బాబు కృషి అజరామరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చీదెళ్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు వసంతకుమార్, హిమవంతరెడ్డి, గుంటుక రామాంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటయ్య, శకుంతల, సమత, హరీష్, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.



లెనిన్‌బాబును సన్మానిస్తున్న ఎంఈఓ, టీచర్లు

కొనసాగుతున్న శిక్షణ తరగతులు



మిర్యాలగూడ టౌన్ : శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీఓ మమత



డిండి : శిక్షణ తరగతులకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

మిర్యాలగూడ టౌన్ : పోషణ్ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొదటి రోజు కార్యక్రమాన్ని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ ఆర్ మమత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు పోషణ, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై వివరించారు. శిక్షణ ద్వారా పౌష్టికాహారం, విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 17 నుంచి పోషణ మాసం కార్యక్రమం ప్రారంభం అవుతుందని, దీనిని నెల రోజుల పాటు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ మూడు రోజుల పాటు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, వాణి, లీలాకుమార్, నజీమాబేగం, నాగమణి, పద్మ, బ్లాక్ కో ఆర్డినేటర్ కవితతో పాటు పలువురు అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

డిండి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని చెర్కపల్లి రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న శిక్షణా తరగతులు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు రేణుకారెడ్డి, రమణ ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంలోని పోషక విలువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వారు వివరించారు. అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే చిన్నారలకు అందించే విద్యపై పలు సూచనలు ఇచ్చారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

హాలియా: హాలియాలోని స్థానిక ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం అమీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ గుండా కృష్ణమూర్తి మాట్లాడుతూ అమీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవ లో ముందుండటం అభినందనీయమన్నారు. మైనారిటీ నాయకులు మజహర్ మొయినోద్దీన్ మాట్లాడుతూ శ్రమ మన ఆయుధం సేవ మన లక్ష్యం అనే నినాదంతో అమీర్ అలీ ఫౌండేషన్ స్థాపించి అనారోగ్యంతో ఉన్న పేద కుటుంబాలకి చేయూతగా నిలవడం ఫౌండేషన్ లక్ష్యమన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం రమణయ్య, ఖదీర్, బలరాం, గౌస్ బాబ , యూసుఫ్, కరిష్మా ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



బ్యాగులతో విద్యార్థులు, ఎంఈఓ, సభ్యులు

కేజీబీవీలో వసతులు కల్పించాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ : దేవరకొండ డివిజన్ పరిధిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం, ఇతర ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరుతూ మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, విద్యను అందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు వసతి గృహాలను తనిఖీ చేయాలని ఆయన ఆర్డీఓను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వరికుప్పలశ్రీను, భిక్షమయ్య, కోటేశ్వర రావు, శ్రీనివా స్,అంజి,మోతీలాల్, తదితరులున్నారు.

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తోన్న బీజేపీ



చందంపేట : సాయుధ పోరాట వారోత్సవాల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

మాడుగులపల్లి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని బీజేపీ పార్టీ మతం రంగు పులిమి చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. బీజేపీ వైఖరిని నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి మాట్లాడారు. ఇప్పటికైనా బీజేపీ తీరు మార్చుకోకపోతే ప్రజలు గుణపాఠం చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, కుర్ర ఎల్లయ్య, కృష్ణయ్య, మల్లయ్య, భూపతిరెడ్డి, నాగయ్య, రవి, నర్సిరెడ్డి, మాధవరెడ్డి, యాదయ్య, పాల్గొన్నారు.

పెద్దవూర: వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కందాల పర్వత చార్యులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య మాట్లాడుతూ పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల ఆశయ సాధన కోసం అనేక పోరాటాలు చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోరెపల్లి మల్లయ్య, చెన్ను లచ్చిరెడ్డి, భవనాచారి, లచ్చమ్మ, పాల్గొన్నారు.



మాడుగులపల్లి : అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వారోత్సవాలను విజయవంతం చేయండి

చందంపేట : సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం చందంపేట మండలంలోని ముడుదండ్ల, గన్నెర్లపల్లి,గుంటిపల్లి గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో 77వ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మైనొద్దీన్, ఆంజనేయులు, వెంకటయ్య, వెంగలయ్య, శేఖర్‌రెడ్డి, మారెడ్డి కృష్ణారెడ్డి, కృష్ణయ్య, మహేశ్, పాల్గొన్నారు.

పాఠశాలకు డెస్క్ బెంచీల బహూకరణ

గుర్రంపోడు : పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని దాత, విద్యావేత్త వడ్డిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నడికూడ జెడ్పీహెచ్ఎస్ రూ.25వేల విలువైన 8డెస్క్ బెంచీలను గెలాక్సీ క్లబ్ ప్రోత్సాహంతో ఆయన బహూకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, గణేష్, భవాని శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం కె.జగన్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలి



ఎక్స్ పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కొండమల్లేపల్లి : హైదరాబాద్‌లోని నార్సింగ్‌లో ఈనెల 19 నుంచి21 వరకు నిర్వహించే ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఫొటో ఎక్స్ పో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సమడం జయరాం, మేదరి భాస్కర్, నక్క జానయ్య, సయ్యద్ పాషా, యాదగిరి, సందీప్‌కుమార్, రమేష్, వెంకట్, మురళీ, దీప్లా, పాషా, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

గుర్రంపోడు : ఓటర్ల జాబితా పక్కాగా రూపొందించడంలో బీఎల్ఓల పాత్ర కీలకమని తహసీల్దార్ పి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్ఓల సమావేశంలో మాట్లాడారు. బీఎల్ఓలు 2002నాటి ఓటరు జాబితాకు ఇప్పటి ఓటరు జాబితాకు సరిపోల్చి మరణించిన, వలస వెళ్లిన వారి పేర్లు విచారణ జరిపి తొలగించాల్సి ఉంటుందన్నారు. కొత్త ఓటర్లకు ఇప్పటికీ ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం ఉన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

మాడుగులపల్లి : మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన 45 మంది నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాగా మంగళవారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సబ్బు హరికృష్ణరెడ్డి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిరియాదవ్, సతీష్, సైదులు, సతీష్, శ్రీకాంత్, లబ్ధిదారులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగాఆయన పోలీస్ స్టేషన్ రికార్డులు, ఆయుధాలను పరిశీలించి మాట్లాడారు. పాత నేరస్తుల గురించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య పాల్గొన్నారు.